క్లుప్తంగా

చురుగ్గా పూడికతీత పనులు



ఏలేశ్వరం పంట కాలువలో జేసీబీతో పూడిక తొలగిస్తున్న దృశ్యం

ఏలేశ్వరం: స్థానిక తిమ్మరాజుచెరువు ప్రధాన పంట కాలువల్లో పూడికతీత పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో ఇరిగేషన్ అధికారులు కాలువల్లో పూడికతీత పనులు ముమ్మరం చేశారు. ఆదివారం జేసీబీ సాయంతో పట్టణంలోని షిర్డీనగర్, పైపులైన్ ప్రాంతంలో పూడికను తొలగించారు. తిమ్మరాజు చెరువు ద్వారా సుమారు 6 వేల ఎకరాలను సాగునీరు అందిస్తున్నారు. దీని ద్వారా ఏలేశ్వరం, లింగంపర్తి, పేరవరం, భద్రవరం, సిరిపురం తదితర గ్రామాల్లో ఆయకట్టుకు నీరు అందుతోంది. రైతులు, అధికారులు దగ్గరుండి పూడిక పనులను పర్యవేక్షిస్తున్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



జి.కొత్తపల్లిలో రోగులకు పరీక్షలు చేస్తున్న డాక్టర్

శంఖవరం: మండలంలోని జి.కొత్తపల్లిలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. కాకినాడ అంజు కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని సర్పంచ్ ఈగల విజయదుర్గ ప్రారంభించారు. డాక్టర్ తేజ ఆధ్వర్యంలో సిబ్బంది సుమారు 200 రోగులకు మందికి కంటి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. 50 మందిని కంటి ఆపరేషన్ల నిమిత్తం కాకినాడ అంజు ఆసుపత్రికి తరలించారు. 25 మందికి కళ్లజోళ్లు అందజేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ షార్మిణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఏగులమ్మ అమ్మవారి జాతర



జాతరలో ఆకట్టుకున్న నవదుర్గ వేషధారణలు

ప్రత్తిపాడు: మండలంలోని పెదశంకర్లపూడిలో ఏగులమ్మ అమ్మవారి జాతర మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కలు తీర్చుకున్నారు. తప్పెటగుళ్లు, తీన్‌మార్ నడుమ నవదుర్గ వేషధారణలతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. నవదుర్గ వేషధారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. చినశంకర్లపూడి, లంపకలోవ తదితర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి జాతరను వీక్షించారు.

హాస్టల్ విద్యార్థులకు వసతి ఏర్పాటు చేస్తాం

జగ్గంపేట: స్థానిక సోషల్ వెల్ఫేర్, బీసీ హాస్టళ్లలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు ప్రభుత్వోన్నత పాఠశాలలో తాత్కాలికంగా వసతి ఏర్పాటు చేస్తామని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ తెలిపారు. జగ్గంపేటలో శిథిలావస్థకు చేరిన ఎస్సీ, బీసీ హాస్టల్ భవనాలను ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చేస్తామన్నారు. ప్రభుత్వం నుంచి నిధులు రప్పించి హాస్టళ్లకు కొత్త భవనాలు నిర్మిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.

15 అడుగుల కొండచిలువ హతం



కొండ చిలువను హతమార్చిన కూలీలు

జగ్గంపేట: మండలంలోని జె.కొత్తూరు సమీపంలోని జటాద్రి కొండ వద్ద జీడిమామిడి తోటలో 15 అడుగుల కొండచిలువ హల్‌చల్ చేసింది. అక్కడ పనిచేస్తున్న కూలీలను పరుగులు పెట్టించింది. ఈ ఘటన రెండు రోజుల క్రితం జరగగా ఆదివారం వెలుగు చూసింది. సినీ హీరో రవితేజకు చెందిన జీడిమామిడి తోటలో గత రెండు రోజులుగా కూలీలు తుప్పల తొలగింపు పనులు చేపట్టారు. ఈ నేపథ్యంలో ఓ చెట్టు వద్ద ఉన్న కొండచిలువ కూలీల మీదకు రావడంతో వారు భయంతో పరుగులు పెట్టారు. అనంతరం కర్రలతో అక్కడకి చేరుకుని కొండచిలువను హతమార్చారు. భారీ కొండచిలువను చూసేందుకు గ్రామస్తులు భారీగా తరలివచ్చారు.



ఇ.గోకవరంలో సుబ్బారెడ్డి సాగర్ ప్రాజెక్టులో కానరాని నీటి నిల్వలు



ధర్మవరంలో అడుగంటిన రామభద్రరాజు చెరువు

కళ తప్పిన జలాశయాలు

- సాగునీటి ప్రాజెక్టులు, చెరువుల్లో కానరాని నీటినిల్వలు
- ముమ్మరంగా ఖరీఫ్ సాగు
- వ్యవసాయ పనుల్లో అన్నదాతలు బిజీబిజీ
- మండలంలో 10,500 ఎకరాల్లో సాగు

ప్రత్తిపాడు రూరల్: తొలకరి ప్రారంభమై నెల రోజులు దాటినా ఆశించిన స్థాయిలో వర్షాలు కురవలేదు. ఫలితంగా నియోజకవర్గంలోని సాగునీటి జలాశయాలు వెలవెలబోతున్నాయి. చెరువులు, జలాశయాల్లో నీరు చేరకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో ప్రధాన సాగునీటి ప్రాజెక్టులైన సుబ్బారెడ్డి సాగర్ ద్వారా పది వేల ఎకరాలు, కట్టుచింతల ప్రాజెక్టు ద్వారా ఐదు వేల ఎకరాలకు, పుష్కర ఎత్తిపోతల పథకం ద్వారా మరో పది వేల ఎకరాలకు సాగు నీరు అందుతోంది. ఈ ఏడాది వేసవిలో భారీగా నమోదైన ఉష్ణోగ్రతలకు ప్రాజెక్టులు మునుపెన్నడూ లేని విధంగా అడుగంటిపోయాయి. జూన్ మాసం నుంచి ఇప్పటి వరకూ చెప్పుకోదగ్గ వర్షాలు కురవకపోవడంతో ప్రాజెక్టులు ఇప్పటికీ వెలవెలబోతున్నాయి. ఏటా జూన్ నెలాఖరు నాటికే భారీగా కురిసే వర్షాలకు ప్రాజెక్టులు నిండుకుండల్లా మారేవి. ప్రస్తుతం ఆ పరిస్థితి కనిపించడం లేదు. ఇక పంట చెరువుల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. దీంతో రైతుల్లో రోజురోజుకూ ఆందోళన రెట్టింపు అవుతోంది. ప్రస్తుత సీజన్‌లో వర్షాలు కురిసి ప్రాజెక్టుల్లోకి నీరు చేరకపోతే ఖరీఫ్ గట్టెక్కడం కష్టమేనని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇక పుష్కర ఎత్తిపోతల పథకం ద్వారా అంతంత మాత్రంగానే సాగునీరు అందుతోంది. దీంతో రైతులు ఆశగా వర్షాల కోసం ఎదురు చూస్తున్నారు.

అడుగంటిన చెరువులు

మండలవ్యాప్తంగా భారీ సంఖ్యలో చిన్న, పెద్ద తరహా చెరువులు ఉన్నాయి. ఈ ఏడాది వేసవిలో నమోదైన భారీ ఉష్ణోగ్రతలకు చెరువులు ఎండిపోయాయి. ప్రస్తుతం సమృద్ధిగా వర్షాలు కురవకపోవడంతో చెరువులు వెలవెలబోతున్నాయి. మండలంలోని ధర్మవరంలో రామభద్రరాజు, తమ్మయ్య, కలువల, రేగుల, వెంటివారి చెరువులు, చింతలూరులో నామానుజం, పెద్ద చెరువులు, ఒమ్మంగిలో రాజ్, గోపాలుడు చెరువులు, ఉత్తరకంచిలో మల్లుదొర చెరువు, పెదశంకర్లపూడిలో వెంకన్నదొర చెరువు, చిన శంకర్లపూడి కుడుముల, కొత్త చెరువులు, ఏలూరు వెంకటపతిరాజు చెరువు, ప్రత్తిపాడులో పుత్ర, ఊర, సిద్ధావారి, దేవుళ్లపల్లె వారి చెరువులు, పోతులూరులో పెద్ద చెరువు, శరభవరం పెద్ద చెరువు, పొదురుపాకలో దార చెరువు, రాచపల్లిలో అంకమ్మ, గుల్లింకవారి, పేర్రాజు, రంగరాజు, తిమ్మరాజు వెరసి మొత్తం 52 చెరువులు ఉన్నాయి. వీటి ద్వారా ఐదు వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతోంది. కాగా ప్రస్తుతం ఈ చెరువులన్నీ నీరులేక వెలవెలబోతున్నాయి. రైతులు దేవుని మీద భారం వేసి ఖరీఫ్ సాగు చేపట్టారు.

అరకొరగా వర్షాలు

ఈ ఏడాది తొలకరి ప్రారంభంలో అరకొరగా వర్షాలు కురిశాయి. భవిషత్‌లో వర్షాలు కురిసి పొలాలకు పూర్తిస్థాయిలో నీరు అందుతుందనే ఆశతో రైతులు సాగుకు సన్నద్ధమయ్యారు. జూన్ ముగిసి జులైలో పక్షం రోజులు పూర్తయినా వర్షాల జాడ కనిపించడం లేదు. అడపాదడపా ఆకాశం మేఘావృతమై తుంపర జల్లులు పడడంతో రైతులు నిరాశ చెందుతున్నారు. కాగా పలు గ్రామాల్లో రైతులు ఇప్పటికే వరి నారుమళ్లు వేశారు. మరికొన్ని చోట్ల వెదజల్లు విధానంగా సాగు చేసేందుకు రైతులు సన్నద్ధం అవుతున్నారు. ప్రత్తి, సరుగుడు, కూరగాయలు, ఇతర పంటలు సాగు చేసే రైతులు సైతం వర్షాల కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. కాగా వ్యవసాయ బోర్ల పరిధిలో వేసిన వరి నారుమళ్లు ఏపుగా ఎదుగుతున్నాయి.



కిత్తమూరిపేటలోని కట్టుచింతల ప్రాజెక్టులో అడుగంటిన జలాలు

అంతంత మాత్రంగా వర్షపాతం

ఈ సీజన్‌లో మండలంలో జూన్ 22న అత్యధికంగా 3.6 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదైంది. ఖరీఫ్ సీజన్ ప్రారంభించాలంటే 83 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కావాలి. కాగా జూన్ నెల నుంచి ఇప్పటి వరకూ 65.6 మిల్లీ మీటర్ల మేర వర్ష పాతం నమోదైందని అధికారులు తెలిపారు. వర్షాలు కురువకపోవడంతో రైతులు నారుమడులను పూర్తి స్థాయిలో సిద్ధం చేసుకోలేకపోయారు.

15,577 ఎకరాల వ్యవసాయ సాగు

ప్రత్తిపాడు మండలంలో 15,577 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. దీనిలో 10,500 ఎకరాల్లో వరి, 1500 ఎకరాల్లో పత్తి, 925 ఎకరాల్లో మినుము, 105 ఎకరాల్లో పెసలు, 2,547 ఎకరాల్లో ఇతర పంటలను సాగు చేసే అవకాశం ఉన్నట్టుల్ వ్యవసాయాధికారులు తెలిపారు.

వర్షాలు కురవకుంటే సాగు కష్టమే



వేసవిలో భారీ ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ప్రాజెక్టులు పూర్తిగా అడుగంటాయి. తొలకరి ప్రారంభమై నెల రోజులకు పైగా అవుతోంది. ఇప్పటివరకూ చెప్పుకోదగ్గ వర్షం కురవలేదు. వర్షాలు కురవకపోవడంతో ప్రాజెక్టుల్లోకి నీరు వచ్చి చేరలేదు. గతంలో వర్షాలు పుష్కలంగా కురిసేవి. జూలైలో మొదటి వారంలోనే ప్రాజెక్టుల్లోకి భారీగా వరద నీరు వచ్చి చేరేది. ప్రాజెక్టులకు నిండుకుండలు తలపించేవి. ఇప్పుడు ఆ పరిస్థితి కనిపించడంలేదు. వర్షాలు పుష్కలంగా కురిస్తేనే సాగుకు పూర్తిస్థాయిలో నీరు అందుతుంది.

– గొర్ల బాబ్జి, రైతు, పెద్దిపాలెం, ప్రత్తిపాడు మండలం

ఈ ఏడాది వర్షాలు ఆలస్యం



వర్షాలు ఈ ఏడాది ఆలస్యం కావడంతో ప్రాజెక్టుల్లోకి చెప్పుకోదగ్గ స్థాయిలో నీరు రాలేదు. మండలంలోని సుబ్బారెడ్డి సాగర్, కట్టుచింతల ప్రాజెక్టులు, పంట చెరువుల్లోకి వర్షాధారంగానే నీరు వచ్చి చేరుతుంది. వర్షాలు లేకపోవడంతో ప్రాజెక్టులు, పంట చెరువులకు నీటి ఎద్దడి నెలకొంది. 87 మీటర్ల సామర్థ్యం కలిగిన సుబ్బారెడ్డి సాగర్ ప్రాజెక్టులో ప్రస్తుతం 81.80 మీటర్లు మాత్రమే నీరు ఉంది.

– ఇబ్రహీం, ఏఈఈ, ఇరిగేషన్, ప్రత్తిపాడు

ముగిసిన పశుగ్రాస వారోత్సవాలు



ఎస్.అన్నవరంలో పాడిరైతులకు రాయితీపై పశుగ్రాస విత్తనాలు అందిస్తున్న ఏడీ శ్రీధర్

తుని రూరల్: పశుగ్రాసం కొరతను నివారించేందుకు గాను రైతులకు 75 శాతం రాయితీపై విత్తనాలు సరఫరా చేస్తున్నట్టు తుని ఏరియా వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ వి.శ్రీధర్ తెలిపారు. ఈ నెల 7న ప్రారంభమైన పశుగ్రాస వారోత్సవాలు ఆదివారంతో ముగిసినట్టు ఆయన తెలిపారు. చివరిరోజు ఎస్.అన్నవరంలో జరిగిన కార్యక్రమంలో రైతులకు రాయితీపై పశుగ్రాస విత్తనాలు పంపిణీ చేశారు. పశుగ్రాసం ప్రాముఖ్యతపై రైతులకు అవగాహన కల్పించామన్నారు. ప్రభుత్వ ఆదేశాలతో పశుగ్రాసం విత్తనాలను ఏరియా పశువైద్యశాల తునిలో 75 శాతం రాయితీపై అందిస్తున్నట్టు డాక్టర్ శ్రీధర్ తెలిపారు. రైతులు ఎకరానికి 12 కిలోలు విత్తనాలు వేసుకోవాలన్నారు. విత్తనాలు వేసిన 45 నుంచి 50 రోజుల్లో మొదట విడత కోతలో పది నుంచి 12 టన్నులు పశుగ్రాసం లభిస్తుందన్నారు. రెండో విడతతో 30 రోజులకే పశుగ్రాసం లభిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

కోటనందూరు: మండలంలోని కేఓ అగ్రహారంలో ఈ నెల ఏడు నుంచి జరుగుతున్న పశుగ్రాస వారోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. పశుసంవర్ధక శాఖ ఏడీఏ వి.శ్రీధర్ ఆధ్వర్యంలో పశువైద్యాధికారులు రైతులకు పశుగ్రాస ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏడీఏ శ్రీధర్ మాట్లాడుతూ అన్ని రైతు సేవా కేంద్రాల్లో జొన్న, మొక్కజొన్న, ఎస్ఎస్ 59/3 రకం గడ్డి విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. 75 శాతం రాయితీపై రైతులకు విత్తనాలు అందిస్తామన్నారు. పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నెల రోజులకే మాట మార్చారు

- ఎన్నికల హామీలు అమలు చేయకపోతే ప్రభుత్వాన్ని నిలదీస్తాం
- మాజీ మంత్రి తోట నరసింహం
- జగ్గంపేటలో విలేకరుల సమావేశం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న తోట నరసింహం

జగ్గంపేట: కూటమి ప్రభుత్వం ప్రజలకు అమలు కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, అధికారం చేపట్టి నెల రోజులు కాకుండానే మాటలు మారుస్తూ హామీలకు కొర్రెలు వేస్తోందని వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి తోట నరసింహం విమర్శించారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు తల్లికి వందనం పథకం ద్వారా కుటుంబంలో పిల్లలందరికీ ఒక్కొక్కరికి రూ.15 వేల చొప్పున ఇస్తామని కూటమి నేతలు చంద్రబాబునాయుడు, పవన్ కల్యాణ్, లోకేష్ హామీలు గుప్పించారన్నారు. నేడు కుటుంబంలో ఒక్కరికి మాత్రమే రూ.15 వేలు అంటూ మెలిక పెట్టి జీవో నంబర్ 29 విడుదల చేశారన్నారు. ఈ జీవోపై తల్లుల నుంచి నిరసన వ్యక్తం కావడంతో ఆధార్ లింక్ కోసం అంటూ వక్రభాష్యం చెబుతున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక పేరుతో దోపిడికి తెరలేపిందని ఆరోపించారు. ఉచితం అంటే కేవలం వాహనం తీసుకువెళ్లి ఇసుక తెచ్చుకోవడమని ప్రజలు భావించారని, ఇప్పుడు ఇసుక ధర గతం కన్నా పెరిగిందని తెలిపారు. ప్రభుత్వం నేతలు ఎన్నికలకు ముందు ఇచ్చిన అమలు చేయకపోతే వైఎస్సార్ సీపీ నిలదీస్తుందని హెచ్చరించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై కేసులు పెట్టడం, గ్రామాల్లో వైఎస్సార్ సీపీ నేతలను భయభ్రాంతులకు గురి చేయడం వంటి కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని హితవు పలికారు. మెట్ట ప్రాంతానికి సాగునీరు అందించడానికి ప్రభుత్వం కృషి చేయాలని, ప్రజలకు మంచి చేస్తే ప్రభుత్వానికి సహకరించడానికి తాము సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు.

నియోజకవర్గంలో పటిష్టంగా పార్టీ

అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన వారినే ఎన్నికల అనంతరం నియోజకవర్గ ఇన్‌చార్జిలుగా పార్టీ కొనసాగిస్తోందని, ప్రస్తుతం తానే జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జిని అని తోట నరసింహం తెలిపారు. పార్టీ నేతలు, కేడర్, అభిమానులను గందరగోళానికి గురి చేయడానికి కొంత మంది అసత్యం ప్రచారం చేస్తున్నారన్నారు. నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ పటిష్టంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో జగ్గంపేట, గండేపల్లి, గోకవరం మండలాధ్యక్షుడు రావుల గణేష్‌రాజా, మద్దిపట్ల రామకృష్ణ, పాటి రాంబాబు, జగ్గంపేట పట్టణ అధ్యక్షులు కాపారపు ప్రసాద్, రామకుర్తి జగాల్, మూర్తి, గణపతి తదితరులు పాల్గొన్నారు.

ఎడతెరిపి లేకుండా వర్షం



లింగవరంకాలనీలో బురదమయంగా మారిన ఎంపీపీ స్కూల్ ప్రాంగణం



ఏలేశ్వరం క్వారీ ప్రాంతంలో రహదారిపై నిలిచిన వర్షపునీరు

ఏలేశ్వరం: అల్పపీడన ప్రభావంతో నియోజవర్గ వ్యాప్తంగా ఆదివారం ఎడతెరిపి లేకుండా వర్షం పడింది. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పట్టణంలోని పలు ప్రాంతాల్లో రహదారులపై వర్షం నిల్వ ఉండిపోయింది. స్థానిక క్వారీ ప్రాంతంలో వర్షపునీరు రహదారిపై నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. లింగవరం కాలనీలో ఎంపీపీ స్కూల్ ప్రాంగణం బురదమయంగా మారింది. మండలంలోని లింగంపర్తి, జె.అన్నవరం, తూర్పు లక్ష్మీపురం, యర్రవరం తదితర గ్రామాల్లోని పల్లపు ప్రాంతాల్లో వర్షపు నీరు నిల్వ ఉండిపోయింది. అధికారులు స్పందించి రహదారులు, పల్లపు ప్రాంతాల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. వర్షాల పడటంతో రైతులు ఖరీఫ్ నారుమళ్లు వేస్తున్నారు. వర్షాలకు అంటురోగాలు ప్రబలకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

గోపాలపట్నం రైల్వేగేటు మూసివేత

తొండంగి: రైల్వేట్రాక్ మరమ్మతుల కారణంగా మండలంలోని గోపాలపట్నం రైల్వేగేటును మూడు రోజుల పాటు మూసివేయనున్నట్టు రైల్వే అధికారులు తెలిపారు. రైల్వే ట్రాక్ మరమ్మతుల్లో భాగంగా సోమవారం నుంచి గురువారం వరకూ ట్రాక్ గేటు మూసి వేస్తామన్నారు. వాహనదారులు గమనించి ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలని సూచించారు. ఈ రైల్వే గేటు మీదుగా తొండంగి మండలం నుంచి అన్నవరానికి నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. గేటు మూసివేస్తే పి.ఇ.చిన్నాయపాలెం, రావికంపాడు రైల్వే గేటు మార్గాల ద్వారా జాతీయరహదారి చేరుకుని అన్నవరం, ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి ఉంది. దీనివల్ల మరో పది కిలోమీటర్లు అదనంగా ప్రయాణించాల్సి ఉంటుంది. మూడు రోజుల పాటు వాహనదారులకు ఈ కష్టాలు తప్పవు.

శాకంబరిగా ముత్యాలమ్మ అమ్మవారు



శాకంబరి అలంకరణలో ముత్యాలమ్మ అమ్మవారు

సామర్లకోట: కాకినాడ రోడ్డులో ఉన్న ముత్యాలమ్మ అమ్మవారు ఆదివారం శాకంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాఢ మాసం కావడంతో అమ్మవార్లను శాకాంబరి అలంకరణ చేయడం పరిపాటి. ఇందులో భాగంగా పంచారామ క్షేత్రమైన బాలా త్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వర స్వామి దేవస్థానం దీపారాధన సంఘ సభ్యులు కూరగాయలు, పండ్లతో ముత్యాలమ్మ అమ్మవారిని అలంకరించి, పూజలు చేశారు. ఆదివారం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు అనేక వాహనాల్లో రావడంతో కాకినాడ రోడ్డు తిరునాళ్లను తలపించింది. ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

తునికి చేరిన పుష్కర జలాలు



టి.వెంకటాపురం వద్ద పుష్కర కాలువలో ప్రవహిస్తున్న గోదావరి జలాలు

తుని రూరల్: పుష్కర ఎత్తిపోతల పథకం నుంచి తుని మండలానికి గోదావరి జలాలు చేరాయి. ఇటీవల పురుషోత్తపట్నం వద్ద ఎత్తిపోతల పథకం ప్రారంభించడంతో శివారు ప్రాంతమైన తుని మండలానికి పుష్కర కాలువ ద్వారా గోదావరి జలాలు చేరాయి. తుని మండలంలో గవరపేట, టి.తిమ్మాపురం, టి.వెంకటాపురం, హెచ్.కొత్తూరు, హంసవరం, జిల్లేడుపాడు, వల్లూరు, ఎన్.చామవరం, ఎస్.అన్నవరం గ్రామాలకు, తొండంగి మండలంలో పైడికొండ తదితర గ్రామాల పరిధిలో చెరువులకు పుష్కర జలాలను మళ్లిస్తారు. చెరువుల నుంచి పంట పొలాలకు సాగునీరు చేరనుంది. నియోజకవర్గంలో ఐదు వేల ఎకరాలకు పుష్కర కాలువ ద్వారా సాగునీరు అందిస్తామని పుష్కర ఈఈ గోవిందు తెలిపారు. ముందుగా శివారు ప్రాంతాల చెరువులకు నీరు మళ్లిస్తున్నట్టు తెలిపారు. రైతులు వంతుల వారీగా సాగునీరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలు, పుష్కర జలాలు అందుబాటులోకి రావడంతో మెట్ట ప్రాంతంలో ఖరీఫ్ పనులు ఊపందుకోనున్నాయి.

తీరంలో పర్యాటకుల సందడి



కడలి కెరటాల్లో కేరింతలు కొడుతున్న పర్యాటకులు

కొత్తపల్లి: మండలంలోని ఉప్పాడ సాగరతీరం ఆదివారం పర్యాటకులతో కళకళలాడింది. కొత్తపల్లి మండలంలోని వివిధ గ్రామాలతో పాటు పిఠాపురం, కాకినాడ, గొల్లప్రోలు, సామర్లకోట తదితర ప్రాంతాలకు చెందిన పర్యాటకులు ఉప్పాడ బీచ్‌కు వచ్చి సందడి చేశారు. ఉదయం తుని సమీపంలోని లోవ తలుపులమ్మతల్లి అమ్మవారిని దర్శించుకున్న భక్తులు మధ్యాహ్నానానికి తిరిగి సాగరతీరానికి చేరుకున్నారు. కడలి కెరటాల్లో కేరింతలు కొట్టారు. పర్యాటకుల ఆటపాటలతో సాగర తీరం క్రీడా మైదానంగా మారిపోయింది. అధిక సంఖ్యలో వాహనాలు రావడం వల్ల కాకినాడ–ఉప్పాడ బీచ్‌లో రోడ్డు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కొత్తపల్లి: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నాగులపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి సౌజన్య సూచించారు. ఆదివారం ఆమె విలేకర్లతో మాట్లాడారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున కండ్ల కలక వ్యాధి వ్యాప్తి చెందుతుందన్నారు. సగటున రోజుకు 20 నుంచి 30 వరకు కేసులు వస్తున్నాయని ఆమె తెలిపారు. కండ్ల కలక అంటువ్యాధి కాదన్నారు. కండ్ల కలక వచ్చినపుడు ఎట్టి పరిస్థితిల్లోనూ కంటిని నలపరాదన్నారు. గోరువెచ్చని నీటితో కళ్లను శుభ్రం చేసుకోవాలని సూచించారు. కంటి వైద్య నిపుణులను సంప్రదించి తగిన మందులు వేసుకోవాలన్నారు. కండ్ల కలక వచ్చిన వ్యక్తికి డ్రాప్స్ వేసిన తర్వాత చేతులను శుభ్రపరచుకోవాలని, లేదంటే అది మరోకరికి వ్యాప్తి చెందే అవకాశం ఉందన్నారు. ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు.

మహిషాసురమర్దినికి అభిషేకాలు

సామర్లకోట: పంచారామ క్షేత్రంలో ఉన్న మహిషాసుర మర్ధిని ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆషాఢ మాసం దుర్గాష్టమి సందర్భంగా ఉదయం అమ్మవారికి అభిషేకాలు, పూజలు చేశారు. పూజల అనంతరం అమ్మ వారిని పట్టు వస్త్రాలతో అలంకరింరు. ఈఓ భళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, సన్నిధిరాజు వెంకన్న, చెరుకూరి రాంబాబు, శ్రీకాకుళపు సత్యనారాయణమూర్తి, వినయ్ పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. అనేక గ్రామాల నుంచి భక్తులు తరలి వచ్చారు. వీరికి ప్రసాద వితరణ చేశారు.